క్లుప్తంగా

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

భోగాపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొత్తం 317 మంది విద్యార్థులకు గాను 309 మంది పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ రమణమూర్తి తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనలియర్ బీటెక్ చదువుతున్న గాజులరేగకు చెందిన కూర్మదాసు శ్రావణికి వాసవీ క్లబ్ సభ్యులు గురువారం ఆర్థిక సాయం చేశారు. శ్రావణి తల్లిదండ్రులు అనారోగ్యం పాలై మంచానికే పరిమితమయ్యారు. దీంతో కళాశాల ఫీజు చెల్లించేందుకు శ్రావణి ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న వాసవీ, ఆర్య వైశ్య సంఘం, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.40 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కందుల సంతోష్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బలబదని నానాజీ, సీతారామయ్య శెట్టి, కుమ్మరిగుంట శ్రీనివాసరావు, డిమ్స్ రాజు, కూసుమంచి వెంకటరావు, గుంపిన నారాయణరావు, ఎంసీహెచ్ గుప్త, ఏవీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న నూకాలమ్మ అమ్మవారు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన విజయనగరం నూకాలమ్మ అమ్మవారి ఆలయ 65 వ వార్షిక మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక కర్రల మార్కెట్, మంగలవీధిలో కొలువైన అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. 21న అమ్మవారి చల్లదన మహోత్సవం, ఘటాలతో ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులందరూ ఉత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించాలని కమిటీ సభ్యులు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదు, ప్రథమ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బీవీ పూర్ణచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 2022–23 సంవత్సరంలో విద్యార్థులు నాలుగో తరగతి, పదో తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం లక్ష రూపాయల లోపు ఉండాలన్నారు. ఈ నెల 24లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఇంటర్‌లో చేరే విద్యార్థులు జూన్ 31, 2023 నాటికి 17 సంవత్సరాల వయసు మించకూడదని.. ఐదో తరతిలో చేరాల్సిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ నుంచి 2014 ఆగస్టు 31 లోపు జన్మించి ఉండాన్నారు. అలాగే బీసీ, ఓసీ విద్యార్థులు 2012 సెప్టెంబర్ నుంచి 2014 ఆగస్టు లోపు జన్మించి ఉండాలని పేర్కొన్నారు.

మొక్కజొన్న కోతలు వాయిదా వేసుకోండి

జామి: రానున్న రెండు, మూడు రోజుల పాటు మొక్కజొన్న పంట కోతను రైతులు వాయిదా వేసుకోవాలని ఏఓ కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచించిన నేపథ్యంలో రైతులు పంట కోత చేయవద్దని, ఇప్పటికే కోసిన పంటను తడిసి పోకుండా భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. మండలంలో ఏ.ఆర్.పేట, భీమసింగి, ఎం.కె.వలస, కుమరాం, తాండ్రంగి విజినిగిరి, జామి అగ్రహారం తదితర గ్రామాల్లో రబీ మొక్కజొన్న సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు.

అమరజీవి త్యాగం భావితరాలకు స్ఫూర్తిదాయకం

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగం భావితరాలకు స్ఫూర్తిదాయకమని కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరజీవి చిత్రపటానికి కమిషనర్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రాన్ని వేరుపరచడం కోసం అమరణ నిరాహార దీక్ష చేసి చివరకు ప్రాణాలర్పించారన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఈఈ శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, టీపీఆర్ఓ సింహాచలం, మేనేజర్ ప్రసాదరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భారతరత్న ప్రకటించాలి..

విజయనగరం: అమరజీవి పొట్టి శ్రీరాములకు భారతరత్న ప్రకటించాలని అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ప్రతినిధి ఆలవెల్లి శేఖర్ అన్నారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అశువులు బాసిన మహనీయుడని కొనియాడారు. అంతటి మహానుభావుడికి భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు జయంతి రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ సముద్రాల నాగరాజు, కోశాధికారి డిమ్స్ రాజు, వెత్స సత్యనారాయణ మూర్తి, ఎంసీహెచ్ గుప్త, బలభద్రుని నానాజీ, సీతారామయ్య శెట్టి, కందుల సంతోష్, గుంపిన నారాయణరావు, ఏవీ కృష్ణారావు, కూసుమంచి వెంకటరావు, విజ్జపు వెంకట శ్రీనివాసరావు, ఉపేంద్ర, గూడూరు నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్, కార్పొరేషన్ ఉద్యోగులు



విజయనగరం: పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శేఖర్, తదితరులు



డెంకాడ: మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఘన నివాళులు..

డెంకాడ: మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపారాణి, పలువురు అధికారులు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పరిశీలన



కొండగుంపాంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాంలో జరుగుతున్న సమగ్ర భూముల రీసర్వే కార్యక్రమాన్ని జేసీ మయూర్ అశోక్ గురువారం పరిశీలించారు. స్థానిక రెవెన్యూ సిబ్బందితో మాట్లాడి భూముల రీసర్వే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భూముల రీసర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని, ఏళ్ల కాలంగా పెండింగ్ ఉన్న సమస్యలు తొలిగిపోతాయన్నారు. సమగ్ర భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. స్థానిక రైతులు పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ రమణరాజు, సర్పంచ్ పతివాడ అప్పన్న, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ మాఫీ..

విజయనగరం: ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై విధించిన వడ్డీని ప్రభుత్వం మాఫీ చేసిందని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీ లోగా ఒకేసారి మొత్తం పన్ను చెల్లించిన వారికే ఈ అవకాశం వర్తిస్తుందని పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులు వెంటనే పన్ను చెల్లించి, వడ్డీ మాఫీ పొందాలని కోరారు.

నిధుల కేటాయింపుపై హర్షం

నెల్లిమర్ల రూరల్: ఏపీ అసెంబ్లీలో ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించడంపై టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. సీతారామునిపేటలో గురువారం ఆయన మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.8384 కోట్లు కేటాయించి దళితవర్గాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

మూడు గ్రామాల్లో భూముల రీసర్వే



మండల కేంద్రంలో రీసర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

భోగాపురం:

మండలంలోని ముంజేరు, కొంగవానిపాలెం, భోగాపురం గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గురువారం భూమల రీసర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర రీసర్వేపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్వేలో భాగంగా రైతుల భూములను పక్కాగా గుర్తించి సరిహద్దు రాళ్లను కూడా ప్రభుత్వమే నాటిస్తుందని, మండలంలోని రైతులందరూ సర్వేయర్లకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు రాము నాయుడు, శ్రీనివాసరావు, ఉషారాణి, ప్రసన్న, శ్రీలక్ష్మి, కాశీశ్వరరావు, సర్వేయర్లు గాయత్రి, భార్గవి, కుమార్, నాయుడు, విద్యాసాగర్, గౌరీశంకర్, ఉమాశంకర్, తేజేశ్వరి, మధు, పి.సురేష్, గంగలక్ష్మి, వాణి, అజయ్, రైతులు పాల్గొన్నారు.

ఈ ప్రయాణం తగునా..?

పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తున్న వారు ఎంతోమంది ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు మనం నిత్యం చూస్తూనే ఉంటాం. అయినా అటు వాహన చోదకుల్లో గాని ఇటు ప్రయాణికుల్లో గాని ఎటువంటి మార్పు కనిపించక పోవడం శోచనీయం. గురువారం ఉదయం కలెక్టరేట్ రోడ్డులో ఓ వాహనం టాప్‌పై పలువురు కూర్చుని వెళ్లడం సాక్షి కంటపడింది.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



సీడీపీఓ తవిటినాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

భోగాపురం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ సీడీపీఓ తవిటినాయుడుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, అంగన్‌వాడీ సిబ్బందికి జీతాలు పెంచాలన్నారు. ఫేస్‌యాప్‌ను రద్దు చేసి, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ సిబ్బందికి వర్తింపజేయాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో బీమా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు కె.కొర్లమ్మ, పి.అనిత, సుజాత, కొండమ్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో టీబీ నివారణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

డెంకాడ: జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా టీబీ రాకుండా నివారించవచ్చని మోపాడ టీబీ నివారణ సూపర్‌వైజర్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. టీబీ నివారణ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మోపాడ కేజీబీవీతో పాటు చింతలవలసలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు టీబీ నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దగ్గు రెండు వారాలకు మించి ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా మందులు ఇస్తామని చెప్పారు. ఎలాంటి అనుమానాలు, భయాలకు పోకుండా వ్యాధి నివారణకు ముందుకు రావాలన్నారు.



మోపాడ కేజీబీవీలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీనివాసరావు

కఫం పరీక్ష చేయించుకోవాలి

విజయనగరం ఫోర్ట్: క్షయవ్యాధి లక్షణాలు ఉన్న వెంటనే కఫం పరీక్ష చేయించుకోవాలని టీబీ సూపర్‌వైజర్ జె. రాజేశ్వరావు సూచించారు. పట్టణంలోని గురజాడ పాఠశాల, కొణిశవీధి అంగన్‌వాడీ కేంద్రంలో క్షయవ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ క్షయ రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు క్రిములు గాలి ద్వారా ఇతరులకు ఆశిస్తాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం లక్షణాలు ఉంటే సమీపంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి కఫం పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఆరు నెలలు మందులు క్రమం తప్పకుండా వాడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ శాంతి, గోవింద, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు



మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న రూరల్ సీఐ తిరుపతిరావు

విజయనగరం క్రైమ్:

యువత మాదకద్రవ్యాల జోలికి పోరాదని రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు సూచించారు. జొన్నవలస జెడ్పీ హైస్కూల్‌లో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మద్యపానానికి, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై గణేష్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: జ్వర పీడితుల పట్ల గ్రామీణ వైద్యులు అప్రమత్తంగా ఉండాలని తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎం.డి డాక్టర్ కె. తిరుమల ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో పీఎంపీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో వివిధ కారణాల వల్ల జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ఈ విషయంలో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లు అప్రమత్తంగా ఉండి, వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌కుమార్ పాత్రో, డాక్టర్ రెడ్డి సుధీర్ నాయుడు, డాక్టర్ రాజేష్, డాక్టర్ వరప్రసాద్, పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు పి. రామయ్యపంతులు, మూర్తి, రాజు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి తీర్థం



బంగారమ్మతల్లి



జామి: ఎడ్ల పరుగు పోటీలు

జామి: మండలంలోని తాండ్రంగి గ్రామంలో బంగారమ్మ తల్లి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు అమ్మవారిని భక్తులు వేకువ జాము నుంచి దర్శించుకుని పసువు, కుంకమ సమర్పించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుంగా గ్రామ పెద్దలు కరక దశరథ, వేచలపు విజయ్‌కుమార్, గేదెల శ్రీనివాస్, బీల వెంకటరావు, సీతారాం తదితరులు తగిన ఏర్పాట్లు చేయించారు.

ఎడ్ల పరుగుపోటీలు

తీర్థంగా సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో మొత్తం 15 ఎడ్ల బళ్లు పాల్గొనగా..మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పోటీలను తిలకించడానికి చుట్టు పక్క గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అభయాంజనేయ స్వామి తీర్థం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో అభయాంజనేయ స్వామి తీర్థం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.తీర్థం సందర్భంగా సాయంత్రం నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఉల్లాసంగా..ఉత్సాహంగా సాగింది.

మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు సంబంధించిన యజమానులకు డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, గ్రామపెద్ద ఎర్రా సన్యాసిరావు, కండిపల్లి పెదనాయుడు చేతులు మీదుగా నగదు బహుమతులు అందజేశారు.



వేపాడ: బొద్దాంలో గుర్రాల పరుగు పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, తదితరులు

హెచ్ఐవీ బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ రామేశ్వరి ప్రభు

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ బాధితులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని హెచ్ఐవీ, కుష్టు, క్షయ నివారణాధికారి డాక్టర్ జె. రామేశ్వరి ప్రభు అన్నారు. గురువారం స్థానిక క్షయ నివారణ కేంద్రంలో వైఆర్‌జీ కేర్ సంస్థ సమకూర్చిన పౌష్టికాహారాన్ని హెచ్ఐవీ బాధిత పిల్లల సంరక్షకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హెచ్ఐవీ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా వాడావాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీటీసీ సెంటర్ల సూపర్‌వైజర్ సాక్షి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామం సమీపంలో గల కొండ ప్రాంతంలో దారపైడితల్లిమ్మ గుడి సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ ఎస్.బాలసూర్యారావు సిబ్బందితో కలిసి గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా అక్కడ పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.